**యేసయ్య మృతులలో నుండి మూడవ దినాన, తిరిగి లేచాడా లేదా అనే విషయాన్ని తార్కికంగా ఆలోచించడానికి పూనుకున్న ప్రతీ మనసులో చైతన్యం తప్పకుండా పునరుద్దానం అవుతుంది. మతాన్నీ మతాధికారులనూ నిర్దయగా విమర్శ చేసి పామరులకు తర్కం నేర్పిన మనిషిని దేవుడ్ని చెయ్యడం, ఆయన చుట్టూ ఒక మతాన్నే అల్లడం ద్వారా మానవజాతి మళ్లీ సమాధిలోకి దూరి తలుపేసుకుంది.**

ఇండస్ మార్టిన్

# 15 పునరుద్దానం

వి.ఆర్. పాళాల





ఆ యాడాదిగూడా మంచి సుక్రారం మాంచి ఎండల్లో వొచ్చింది. మంచి సుక్రారం అంటే మరేం లేదు, మీళ్లంతా ఆపం ధూపం తెలవకుండా యాపీ గుడ్ ఫ్రైడే అని చెప్పి క్రీష్టియన్ల చేతుల్లో కుక్కతిట్లు తింటారే... అదేనన్నమాట. మంచి సుక్రారం క్రిస్టమస్ పండగలాగా ప్రెతీ యాడాదీ టంచనుగా డిసెంబరు ఇరవై అయిదుకు వచ్చే టైపు పండగ కాదు. మనం ఆరో క్లాసు సాంఘీకశాత్రంలోని భూగోళశాత్రంలో సదూంకున్న విషువత్తులు పాటం గ్యాపకం వుందా? మళ్లీ అందులో ఉత్తరాయణ విషువత్తు దచ్చిణాయణ విషువత్తు అనే వుంకో బిట్టు కొచ్చన్ గూడా ఉండేది గందా... ఆ... ఆ... దచ్చిణాయన విషువత్తు అయిన మార్చ్ 21 తరవాత వొచ్చే పున్నమి పక్కనే పొష్టుపొష్టు వచ్చే ఆదోరమే ఈష్టరు. దానికి ముందు వచ్చే సుక్రారమే గుడ్ ఫ్రైడే.

చాక్లేట్టు ఇచ్చిన ప్రెతోడికీ ఆటోమేటీకుగా యాపీ బాడ్డే టూయాయూ అని చెప్పినట్టు గుడ్ ఫ్రైడే అని ఇనీ ఇనకతలికే మీళ్లంతా గ్రీటింగులు చెప్పేత్తారుగానీ అసలికి ఆ రోజు మా వోల్ ఆంధ్ర క్రైస్తవ సంఘానికి దెవసం లాంటిది. ఆ యాలే ఏసూప్రెభువుని శిలువమీద మేకులు దిగేసి సంపేసేరు. అసుమంటి గోరమైన రోజుని పొట్టుకుని యాపీ గుడ్ ఫ్రైడే అంటే నెవరగంతలమీద లాగి ఒక్కటి నూకాలని అనిపిచ్చదా? అయిదు రొట్టెలు రొండు చాపలు అయిదు వేలమందికి పంచిపెట్టిన మడిషి, పెళ్లిలో దాచ్చారసం అయిపోయిందని ఆళ్లమ్మ చెప్పగానే గాబుల్లో నీళ్లు నింపిచ్చి ఆ పచ్చి మంచీళ్లనే మా గుంటూరు అరండాల్ పేట ఎనిమిదో లైనులో ఉండా వాసవీ జూస్ సెంటరుకన్నా ఇంకా ఏ క్లాస్ ద్రాచ్చా రసంగా మార్చిన అసుంటి మడిషిని పొట్టుకుని కట్టేసి కొరడాలతో చెదిచ్చీ చెదిచ్చీ బుజం మీన మాంచి మనగాడు టేకు కొయ్యలతో చేసిన శిలువను పెట్టి వూరంతా తిప్పీతిప్పీ తన్నీ తన్నీ ఆకిరికి మా నిడముక్కల పరింబోడు అసుమంటి కొండమీద పబ్లిక్కులో ఎర్రని ఎండలో సిలువేసి సావనూకినందుకు నలపై రోజులు మేవంతా

ఉపాసాలు ఉంటా, ఏడుత్తా సోకాలు పెట్టుకుంటా వుంటే... మీయసుంటి ఇవరం తక్కువ జనాలు వొచ్చి యాపీ గుడ్ ఫ్రైడే అంటే మండదా... అహా... మండదా అంటా!

ఆ యాడాది గూడా మా ఇంట్లో అన్నం వొండలేదు. మా నాయన ప్యారీషు లోని చెర్చీలలో ప్రార్థనలు చేపిచ్చటానికి పోయేడు. నేను మా నార్త్ ప్యారీషు పరి మత్తయి దేవాలయంలో ఏడు మాటల ధ్యానం ఇనేసి నీరసంగా ఇంటికొచ్చి కూకున్నాను. మా యమ్మ చెర్చీ నుంచి వొచ్చి మళ్లీ ఇంట్లో నెత్తిన ముసుగేసుకుని కన్నీటి ప్రార్థన చేత్తంది. నేను బయటే నిద్రగన్నేరు చెట్టుకింద కుర్చీ ఏసుకుని కూకోని ఏసయ్య సచ్చాడా లేదా అని డొక్కలో బల్లెంతో పొడవటానికి ఆ రోమా సైనికుడికి చేతులెట్టా వొచ్చాయిరా సావీ అని ఒగిటే గిజగిజలాడతా వుండగా స్కూటరేసుకుని వొచ్చేడు మా జోసేపు బాబాయ్.

గంగోలు జోసేపు... మా చిన్నతాత గంగోలు జార్జ్ కవి పెద్దకొడుకు ఆయన. మా తాత గుర్రం జాషువా లెక్కన యమాతారాజభానసలగం లెక్కలు చూసుకుని కయిత్కం రాసిన మడిసి. మా ఇళ్లల్లో పెళ్లీ సావూ ఏద్దైనా మా జార్జి తాత రాసిన పజ్జాలు సదవాల్సిందే...! అసుంటి మాల పండితుడి కొడుకు మా జోసేపు బాబాయ్. బియ్యే సదివి చీరాల బేర్ మిషన్ కాంపౌండులో కమీనిష్టు సావాసగాళ్లతో గాలికి తిరగతా వుంటే మా నాయన జుట్టు పొట్టుకుని ఈడ్సకపోయి రాజమెండ్రి బైబూలు కాలేజీలో పాద్దిరి ట్రైనింగానికి చేర్పిచ్చేడంట. పాదిరి ట్రైనింగు అవుతున్నాడని చూసి ఒంగోలు నుంచి కలిగిన సంబంధం వొస్తే మా తాత ఆయనకి పెళ్లి చేసేశేడు. అక్కడగూడా ఎప్పుడూ తెల్లదొరలతో ఏదో ఒక పంచాయితీ పెట్టుకుంటా, ఇంగ్లీషులో పిటీషన్లూ, యాసాలూ రాత్తా సెమినరీ కళాసులు సరిజ్జిగా జరగనిచ్చే వోడు కాదని మా నాయనకు పితూరీలు చెప్పేవోళ్లు జనాలు. అసుమంటి మడిసి ఎట్టోకట్టా బీటీఎచ్ పూర్తిచేసి మా గుంటూరులోనే నార్తు ప్యారీషుకు అసిస్టెంటు పాస్టరుగా వొచ్చేడు.

ఆరోజు రాటం రాటమే వొదినిమ్మా ఆకలౌతుంది భోజనం పెట్టు అన్నాడు. లోపల మా పాపముల కొరకు శిలువలో నీరక్తం కార్చిన పరమదేవా, మా కొరకు అయిదు గాయములను పొందిన దైవపుత్రుడా, మమ్మల్ని పాపపంకిల జీవితాల నుండి రక్షించడానికి బలియాగం అయిన దేవుని గొర్రెపిల్లా... అనుకుంటా కుమిలి కుమిలి ప్రార్థన చేత్తన్న మాయమ్మకు ఆయన మాటలు ఇనపడ్డయ్యో లేదో... మా బాబాయ్ మళ్లీ రెట్టిచ్చి, "వొదినమ్మా... ఇంగసాల్లే తల్లా... సచ్చిపోయిన ఏసయ్యను ఇంకా ఎన్నిమాట్లు సంపుతారు," అన్నాడు.

ఎప్పుడు పరాశకాలు ఆడినా ముసిముసిగా నవ్వుకునే మా యమ్మకు ప్రార్ధన గురిచ్చి ఎకసెక్కాలు ఆడితేమటికి యేహోవా దేవుడికన్నా ఎక్కువ ఉగ్రత వొచ్చుద్ది.

‘‘యాయ్యా... పొద్దిరిగోరూ... చెర్చీ నుంచి సరాసరి వొచ్చేవా... ఒక్కరోజన్నా ఉపాసం ఉండలేవా... దైవసేవకుడివి అయ్యిండి పదిమందికి దారి సూపిచ్చాల్సి నోడివి... మంచి సుక్రారం రోజైనా ప్రెభువు కోసం ఒక్కపూట పొస్తుండలేవా,’’ అని చెలిగింది.

మా జోసేపు బాబాయ్ పకపకా నవ్వుకుంటా, ‘‘వొదినమ్మా... ఏసయ్య సచ్చిపోకపోయి మళ్లీ మూడోరోజున సమాధి నుంచి లేచేడు కదా.. ఇంకా ఎందుకు మీ ఏడుపులు.. ఆయన మనకోసం పరలోకంలో నివాసాలు ఏర్పాటు చెయ్యడానికి ఆరోహణం అయిపోయేడు... ఇంకా ఎంతకాలం యాడాదికి ఒకపాలి ముక్కు చీదుకుంటా సోకాలు పెట్టుకుంటా ఈ ప్రార్ధనలు చేత్తారూ...’’ అని జేబులో నుంచి సిగెరెట్టు తీసి ఎలిగిచ్చుకున్నాడు.

నాకు లోపల సురసుర మంట మొదలయ్యింది. అంతకుముందు యాడాదే నేను ఇవాంజిలికల్ యూత్ అనే యవ్వనస్తుల గ్రూపులో ఏసయ్యను నా సొంత రక్షకుడిగా అంగీకరిచ్చి నాలుగుసార్లు అవాౖలడీ మీటింగుల్లో సాక్ష్యం గూడా చెప్పేను. ఈ మజ్జన మా యూత్తు గ్రూపు గాస్పుల్ మీటింగుల్లోకి నా సావాసగాళ్లందర్నీ పిలిచి మెల్లిమెల్లిగా క్రీస్తు ప్రేమ గురిచ్చీ, పరలోకరాజ్జెం గురిచ్చీ టూబై టూ షేరింగ్‌లో చెబుతా వుండాను. అసుంటిది, మా బాబాయి, అందు లోనూ సొయంగా పాదిరిగోరు అసుంటి మనిషి ఏసయ్య గురిచ్చీ, గుడ్ ఫ్రైడే గురిచ్చీ ఇంత చాచాతిగా మాట్టాడటం, పైగా సిగిరేట్టు ముట్టిచ్చడం నాకు నచ్చలా!

‘‘అదేంది బాబాయ్... ఏసయ్య మన పాపాలకోసం మరణించాడు కదా, మనందరి పాపాలకోసం పరిహార బలిదానంగా కదా ఆయన శిలువనెక్కిందీ, మనం ఆయనకొరకు కాదుగానీ నిక్కముగా మన పాపములకొరకు పశ్చాత్తాపపడి ప్రలాపించాలని కదా దైవగ్రంథంలో చెప్పిందీ,’’ అని నిలేసేను.

‘రేయ్... సంటోడా... ఏసయ్యను శిలువ వేసింది రోమా సైనికులే. కానీ శిలువ వెయ్యమని వత్తిడి తెచ్చింది మాత్రం ఆయన సొంత జాతి యూదా ప్రజలే. ఎందుకు అలా చేశారంటావూ?’’

నేను నోరు తెరిచి సమాదానం చెప్పేలోపు మళ్లీ మా బాబాయే... ‘‘నువ్వేదన్నా మాట్లాడాలంటే మామూలు తెలుగులో మాట్లాడు... అట్టాగే

బైబూలును కోట్ చెయ్యాలంటే సరిజ్జిగా ఏ గ్రంథం, ఏ అధ్యాయం, ఏ వచనం అనేది చెప్పి మరీ కోట్ చెయ్యి... దైవగ్రంథంలో రాయబడి ఉందీ అని తీగలు తీస్తా మాట్టాడింది ప్రతీదీ బైబూల్లో ఉండట్టు కటింగులు ఇయ్యమాక... మీ మీటింగుల భాష కాసేపు మొచ్చుమీద పెట్టు,'' అన్నాడు.

''ఆయన సొంతజాతి ప్రజలే ఆయన్ను శిలువెయ్యమని పిలాతు దెగ్గిర బాగా అరిచి గీపెట్టిన మాట నిజమే బాబాయ్... ఎందుకంటే ఏసయ్య తానే దేవుడి కుమారుడిని అని చెప్పేడుగదా... ఆళ్ల లెక్కల్లో మనుషులు దేవుడి కుమారులు అనడం దైవదూషణ కదా... అందుకే ఆయన్ని శిలువెయ్యమని గొంతుమీద కూకున్నారు,'' అన్నాను.

''పిచ్చోడా... ఏసయ్యకన్నా ముందే యూదులంతా దేవుని పిల్లలు అని యూదులు నమ్మారు. ప్రపంచకం మొత్తంలో వాళ్లే దేవుడి జనాంగం అనీ దేవుడి చేత ఎన్నుకోబడిన జాతి అని నమ్మేరు. మిగతా జనాలంతా అన్యులనీ, మిగతా దేవుళ్లంతా దయ్యాలనీ, మిగతా మతాలూ ధర్మాలన్నీ అబద్ధం, పాపం అనీ నమ్మారు. ఏసయ్య కొత్తగా దేవుడి కుమారుడిని అని అనలేదు. అసలు కారణం ఏసయ్య యూద మతాధికారులను లెక్కచెయకపోవటమే. జనాల్లోకి పోయి ఆళ్ల మజ్జ కూకోని ఆడామగా తేడా ల్యాకోకుండా అందర్నీ పోగేసి ఇంకో రాజ్జెం స్థాపిద్దాం అని మాట్టాడటమే. అందరూ సమానం, మడుసుల్లో ఎన్నుకున్నోడూ, వెలేసినోడూ అంటా తేడాలు లేవు అని జనాలకు బోధ మొదులుపెట్టేడు. యూదుల ప్రధాన ఆలయంలో జరిగే యాపారాన్ని దెబ్బతీసేడు. తేరగా దెంగి తినడానికి అలవాడ్డ యూద మతాధిపతులకు ఇయ్యన్నీ నచ్చలేదు. ఆళ్ల రాబడి మీద దెబ్బకొట్టేడు, జనాల్లో ఆళ్లంటే భయం తగ్గిచ్చే పని మొదులుపెట్టేడు. ఇంత చేత్తంటే దెంగు దెగులు మొదులుకాదా... అందుకే ఆయన మీద లేనిపోని కంప్లెయింట్లు చేసి ఇన్టిటూషనల్ మడ్డర్ చేపిచ్చేరు,'' అన్నాడు.

''అదేంది బాబాయ్... అట్టాగంటావు, ఏసయ్య మన పాపాల కోసం తానే సొయంగా శిలువనెక్కి చనిపోయి పునర్దానుడై లేచేడు. అదేకదా మన క్రైస్తవ మతానికి ఆయువుపట్టు... మరీ అంత ఇస్సోసం ల్యాకోకుండా మాట్టాడతావేందీ... మతం పెట్టిన బువ్వ తింటా మతానికే ఎసురుపెట్టే మాటలూ... నీ తిరుగుబోతు జీవితానికి అనుకూలంగా ఏసయ్యనుగూడా నక్సలైటును చేత్తన్నావే,'' అని నేను నిష్టూరపడతంటే ఆయన కుర్జీ దెగ్గిరికి జరుపుకుని...

''అబ్బాయ్ సంటీ... మంచి మాట మాట్టాడేవు. ప్రెపంచంలో ఏసుప్రెభువు తరవాత అంత యూత్ ఫాలోయింగు ఉన్న మడిసి ఎవురో తెలుసా,'' అన్నాడు.

నాకు తెలవదని చెప్పాను. ఆయన స్కూటర్ డిక్కీ తెరిచి ఒక బొక్కు తెచ్చి నా చేతికి ఇచ్చేడు. గొరిలా వార్ఫేర్... నెత్తురు రంగు అట్టమీన జులపాలు, టోపీ పెట్టుకున్న మనిషి బొమ్మ కనబడింది.

"ఈయన తెలుసా?" అని అడిగాడు.

"టీషర్టుల మీద చూసేను," అన్నాను.

"ఆ... ప్రపంచం మొత్తంలో ఏసయ తరవాత అంత ఎక్కువగా జనాలు ఇష్టపడే బొమ్మ ఈయనదే... చే గువారా! ఇందాక అన్నావే తిరుగుబోతు జీవితం అనీ... ఆయనే నాకు అది నేర్పాడు. అసలు ఏసయ్య నుంచే ఇదంతా చే నేర్చు కున్నాడని నా అనుమానం. ఏసయ్యమటికి ఇంటిపొట్టున కూకున్న మడిసా... పన్నెండేళ్లప్పుడే అమ్మానాయల్ని వొదిలి యెరూషలేము మందిరంలో పెద్దోళ్ల మజ్జన కూకోని బాతాఖానీ కొట్టిన మనిషికాదా ఏసయ్యా... ఆయన్ని ఎతుక్కుంటా ఏడ్సుకుంటా మరెమ్మా ఏసేబూ మూడ్రోజులు వూళ్లూ ఈదులు ఎట్టా గాలిచ్చు కున్నారో సండే స్కూల్లో చెప్పలేదా? పెద్దయ్యాకా... బతికినంతకాలం ఒక్కచోట ఆయన కాలు కుదురుగ్గా నిలబడిందా? ప్రభుత్వ విధానాలకు నిరసనగా, అంధ ఇశ్వాసాలకు వెతిరేకంగా యప్పుడూ జనాల్ని కూడెయ్యటం, మీటింగులు పెట్టడం... ఇదేగదా ఏసయ్య చేసింది. ఆ మాటకొత్తే బుద్ధుడుమటికీ పెళ్లాం పిల్లల్తో బ్రాడీపేటలో డాబా కట్టుకుని బతిక్యాడా... ఈ లోకం గురిచ్చి తెలుసుకోవా లంటే లోకాన్ని పరిచి దానిమీద నడవాలి. దాన్ని సాపలాగా సుట్టేసి సంకలో పెట్టుకుంటే వచ్చేది జ్ఞానం కాదు... ఇదుగో... మీ క్రిస్టియన్ యూత్తుకు వచ్చిందే... గర్వం... డంబం... అదే వొచ్చేది," అని చెప్పి పుస్తకం నా చేతుల్లో నుంచి తీసుకుని జాగర్తగా స్కూటర్ డిక్కీలో పెట్టుకుని నవ్వుతా కిక్కు కొట్టి ఎల్లిపోయేడు.

నాకు బుర్ర గిర్రన తిరిగింది. మాయమ్మ గోళ్లు కొరుక్కుంటా గడపలోనే కూకుండిపోయింది.

ఆ ఆదివారం ఈష్టరు పండగ. పొద్దున్నే గంపెడు చీకటితో లెగిచి పండగ కోసం నాయన తెచ్చి గూళ్లల్లో పెట్టిన రొండు మనగాడు పుంజుల్ని పొట్టుకుని పీకలు కోసి బొచ్చుపీకి తాటాకుల మంటమీద కాపి పొసుపేసి మర్దనా చేసి కాళ్ల మీద తోలు పీకి పొర్నాకి మెల్లిగా మొద్దుమీద తుంటెలూ, తునకలూ నరికి డబరాకు ఎత్తి అమ్మకు ఇచ్చేసి తానం చేసుకుని కొత్త కాడ్రాయ్ ప్యాంటూ, డిస్కో టీషర్టూ ఏసుకుని చెర్చిలో స్పెషల్ సాంగు పాడాలి, తాలు తల్లా అని నేను బేటికి దూకుతుంటే మాయమ్మ గడపకాడికి వొచ్చి-

"అబ్బాయ్... జోసేపు బాబాయిని అన్నం బోచెయ్యడానికి రమ్మని చెప్పు... ఆరాధన అవ్వగానే వొచ్చి ఒక ముద్ద తినేసి పొమ్మని చెప్పు," అని పురమాయిచ్చింది.

మావూలు ఆదివారాల్లో మా చెర్చీ రొండు ఇడతలుగా పొస్టు సర్వీసూ, సెకండు సర్వీసూ అనీ జరిగేది. పొస్టు సర్వీసు పాద్దిరిగారూ, సెకండు సర్వీసు పాద్దిరిగారూ, మళ్లీ ఆళ్లిద్దరికీ అసిటెంటు పాద్దిరుగార్లూ ఉండేవోళ్లు. మా జోసేపు బాబాయ్ రొండో సర్వీసుకు అసిస్టెంటు పాద్దిరిగారు.

క్రిస్టమాసూ, ఈష్టరు అసుంటి పండగలప్పుడు మటికి ఒకిటే సర్వీసు పొద్దున తొమ్మిదిన్నరకు ఉండేది. ఆరాధన చెర్చీ లోపల కాకుండగా జనాలు పట్టేటట్టు బయట స్టేజీ చుట్టూ టెంట్లు ఏసి జరిగేది.

ఆరోజుగూడా ఎప్పుటికిమల్లే పెద్ద పెద్ద సర్కాసు టెంట్లు ఏసేరు. తెల్లారు జాము అయిదింటి నుంచే మైకులు పెడతా... హలో హలో మైక్ సెట్టింగ్... అలో... అలో... వాన్ టో త్రీ పోర్... పోర్ త్రీ టూ వాన్... అనుకుంటా సందడి సందడిగా ఉంది మా చెర్చీ కాంపౌండు. మా యూత్తు కుర్రోళ్లం యాపచెట్టు కింద అరుగుమీద కూకోని మా స్పెషల్ సాంగుకు ల్యాస్టు ప్ర్యాక్టీసు చేసు కుంటన్నాం. ముందు వరసలో కుర్జీలు దొరకాలని జనాలు కార్లేసుకునీ బైకు లేసుకునీ ఎండాకలం అని కూడా సూడకోకుండా పాట్టు చీరలూ, సూట్లూ దిగేసుకుని వత్తా వుండారు.

ఆరాధన మొదులయ్యింది. ఇద్దరు  పాద్దిరిగోర్లూ, ఇద్దరు అసిస్టెంటు పాద్దిరిగోర్లూ ఒకిళ్లు పాత నిబంధన పాఠం చదివితే వుంకొకళ్లు సువార్త పాఠం సదివేరు. ఒకళ్లు ఆరాధన నడిపితే వుంకొకళ్లు ప్రసంగం చేసేరు. మా స్పెషల్ సాంగూ, సండే స్కూలు పిల్లల స్కిట్టూ అయిపోయి సార్వీసు ఆఖరికి వొచ్చింది.

ప్రభువు మనకు చేసిన మేళ్లన్నిటినిబట్టి ఆయనకు కృతజ్ఞతలు సమర్పించు కుందాం... ప్యారిష్ చర్చ్ కౌన్సిల్ మెంబర్స్ ముందుకు వచ్చి కానుకలు సేకరించ వలసినదిగ మనవి అని మా జోసేపు బాబాయ్ ప్రకటన చేసేడు. అది ఇనీ ఇనం గానే రొండు దిక్కుల నుండి రొండు ముఠాలు పైకి లేచి టేజీ దిక్కు బిరబిరా నడిచేయి. సందా సంచులు పెద్ద పళ్లెంలో పెట్టుకుని ఆ పీసీసీ నెంబర్లకు ఇయ్యాలని ముందుకు వచ్చిన పాద్దిరిగోరు రొండు ముఠాలను చూసి బిత్తర పోయేడు. ఈలోపు రొండు ముఠాలూ చెరొక మైకు మా కొయర్ టీము నుంచి వూడబెరుక్కుని మేవే అసలైన పీసీసీ అంటే కాదు మేవే అసలైన నెంబర్లం అని అరవటం మొదులుపెట్టేరు.

ఇదంతా చూసిన మా జోసేపు బాబాయ్ ఆల్టర్ మీద వున్నా మైకులో, “పీసీసీ ఎలక్షన్లో ఎన్నుకోబడిన సభ్యులే నిజమైన సంఘపెద్దలు. కోర్టు నుండి స్టేలూ, ఇంజెక్షన్లూ తెచ్చుకున్నవాళ్లు తెచ్చుకుని సంఘాన్ని సంఘ ఆస్తులనూ దొంగలపాలు చెయ్యకండి. మీరు మర్యాదగా కూర్చోకపోతే సంఘస్తులే కానుకలు సేకరిస్తారు. యూత్ బైబిల్ స్టడీ మెంబర్స్ ముందుకు వచ్చి కానుకలు సేకరించండి,” అని ప్రకటన చేశాడు!

అంతే... ఆ నిలబడి అరిచే జెనాలలో మా లాడ్జీ సెంటర్ రౌడీలు అని పేరుపడిన సామేలూ, ప్రభాకర్ అసుంటి మడుసులు సందా సంచుల కర్రలు వూడబీక్కుని ఆల్టర్ మీదకిపోయి దొరికిన పాద్దిరిని దొరికినట్టు వాయగొట్టేరు. జనాలు లెగిచి తలా ఒక దిక్కుకి పరిగెత్తడం మొదులుపెట్టేరు. కుర్చీలు గాల్లోకి ఇసిరేసేరు. ముసలీ ముతకా స్త్రీల సమాజం నెంబర్లు ఆడ్నే నిలుసుకోని ఏడుత్తా సంఘాన్ని రక్షించమని నెత్తిన ముసుగులేసుకుని ఏసయ్యను ఏడుకుంటన్నారు.

ఆ మజ్జాణం మాయింట్లో పలావు తినాల్సిన మా జోసేపు బాబాయి లలితా నర్సింగుహోములో తలమీద ఆరు కుట్లేసుకుని నీరసంగా పడుండాడు. ఆయన్ని ఆ రకంగా చూసిన నా మతిలో పునరుద్దానం జరుగుతున్నట్టు అనిపిచ్చింది.

*రచనాకాలం: 6 అక్టోబర్ 2021*
*పాదిరిగారి అబ్బాయి కథాసంపుటి*
*ప్రచురణ: డిసెంబర్ 2021*




9 సెప్టెంబర్ 1969న గుంటూరు జిల్లా ఖాజీపాలెంలో జన్మించిన **ఇండస్ మార్టిన్** మొదటి కథ ***కటికపూలు*** 2018లో అదే పేరుతో ఉన్న కథాసంపుటిలో అచ్చయ్యింది. పాదిరిగారి అబ్బాయి మరో కథాసంపుటి. అప్పుడప్పుడు కవిత్వం రాస్తుంటారు. రాయాలనిపించినవన్నీ బ్లాగుల్లో రాస్తుంటారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. నివాసం హైదరాబాద్.

***indusmartin@gmail.com***